

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను శుక్రవారం మిషన్ భగీథ మాజీ వైస్ చైర్మన్, తలకొండపల్లి మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 27న హైదరాబాద్‌లో జరుగనున్న తన కుమారుడు డాక్టర్ ఉప్పల అనిల్ వివాహానికి కేటీఆర్‌ను ఆహ్వానించినట్లు ఆయన తెలిపారు. - కడ్తాల్, నవంబర్ 22

## తాండూరులో కాలుష్య పరీక్షలు



కాలుష్య పరీక్ష యంత్రాన్ని అమరుస్తున్న సిబ్బంది

తాండూరు, నవంబర్ 22 : తెలంగాణ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో శుక్రవారం తాండూరు పట్టణంలో కాలుష్య పరీక్షలు చేశారు. తాండూరులో రెండు చోట్ల పర్యావరణ శాస్త్రవేత్తలు రెస్పిరేబుల్ డస్ట్ శ్యాంపేర్ యంత్రలను అమర్చారు. ఈ యంత్రాలు గాలిలో నాణ్యతతోపాటు నిర్ధారిస్తాయని అధికారులు పేర్కొన్నారు. 24 గంటలు యంత్రాలను ఆన్‌లో పెట్టి పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం కాలుష్య నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు ఆర్డీఎస్ సిబ్బంది జీమోత, రాజేందర్, శ్రీనివాస్, విక్రం తెలిపారు.

# సీతారాంపూర్ రైతులకు వెంటనే ఇండ్ల స్థలాలు ఇవ్వాలి



సీతారాంపూర్ సీతారామచంద్రస్వామి ఆలయాన్ని సందర్శించిన మాజీ మంత్రి సబితారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ యువ నాయకుడు అవినాశ్‌రెడ్డి

- కేసీఆర్, కేటీఆర్ సహకారంతో ఈ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు
- సీతారామచంద్రస్వామి ఆలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలి
- మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితారెడ్డి

షాబాద్, నవంబర్ 22 : కంపెనీల ఏర్పాటు కోసం భూములిచ్చిన సీతారాంపూర్ గ్రామ రైతులకు ఇండ్ల స్థలాలు వెంటనే అందించాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితారెడ్డి అన్నారు. శుక్రవారం షాబాద్ మండల పరిధిసీతారాంపూర్ సీతారామచంద్రస్వామి ఆలయాన్ని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, షాబాద్ మాజీ జడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డితో కలిసి సందర్శించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్, కేటీఆర్ సహకారంతో సీతారాంపూర్ గ్రామంలో దేవాదాయశాఖకు చెందిన భూమిని కంపెనీల ఏర్పాటు కోసం కేటాయించడం జరిగిందని తెలిపారు. దీంతో షాబాద్ ప్రాంత రూపురేఖలు మారిపోయినట్లు చెప్పారు. అప్పట్లో రైతుల నుంచి భూములు తీసుకునే సమయంలో రైతులందరిరీ ప్లాట్‌లు(ఇండ్ల స్థలాలు) అందిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ప్రస్తుతమున్న కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు వెంటనే ప్లాట్‌లు అందించాలని సూచించారు.

గతంలో సీతారామచంద్రస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు రూ.89 కోట్లు ఆలయం ఖాతాలో జమచేశారని.. ఇప్పటివరకు ఆలయ అభివృద్ధి పనులు చేపట్టడం లేదన్నారు. స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్య ప్రత్యేక చొరవ తీసుకుని రైతులందరికీ ఇండ్ల స్థలాలు ఇప్పించడంతోపాటు, ఆలయాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలని తెలిపారు. అనంతరం గ్రామంలో కటికె సందీప్ ఏర్పాటు చేసిన అయ్యప్ప స్వామి పడిపూజలో సబితారెడ్డి, ఎమ్మెల్యే యాదయ్య, అవినాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు, మాజీ సర్పంచ్ పాండురంగారెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

### పరామర్శ

**మొయినాబాద్ :** కొన్ని రోజుల క్రితం మృతి చెందిన కుటుంబాలను సబితారెడ్డి పరామర్శించారు. బీఆర్ఎస్ మొయినాబాద్ మండల ఉపాధ్యక్షుడు ఎంఏ రవూఫ్ తల్లి అనారోగ్యంతో మృతి చెందగా.. మొయినాబాద్ మాజీ ఎంపీటీసీ చిరాగ్ మోహన్‌గౌడ్ తల్లి వారం రోజుల క్రితం మృతిచెందారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారి మృతికి గల కారణాలను తెలుసుకున్నారు. కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పించారు. దారి వెంబడి వెళ్తున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ఆప్యాయంగా పలకరిస్తూ మాట్లాడారు. ఆమెతో పాటు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు అనంతరెడ్డి, మాజీ ఎంపీటీసీ మోహన్‌గౌడ్, బీఆర్ఎస్ చేవెళ్ల నియోజకవర్గ నాయకుడు ఆంజనేయులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు షేక్ మహబూబ్, నాయకులున్నారు.

## రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

**కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్**



కొనుగోలు కేంద్రంలో ధాన్యం తేమ శాతాన్ని చూస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

బషీరాబాద్, నవంబర్ 22 : కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. ఐకేపీ ఆధ్వర్యంలో కాశీంపూర్ గ్రామంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రానికి వచ్చిన రైతులతో కలెక్టర్ మాట్లాడారు. కొనుగోలు కేంద్రంలో ఏమైనా సమస్యలు ఉన్నాయా..? తూకంలో ఇబ్బందులుంటే వెంటనే పై అధికారులకు తెలియజేయాలని రైతులకు సూచించారు. 14 శాతం కంటే ఎక్కువ తేమ ఉండకుండా ధాన్యాన్ని ఎండబెట్టాలన్నారు. కొనుగోలు కేంద్రాలకు రైతులు అందరూ ఒకేసారి వచ్చి ఇబ్బందులకు గురి కావిద్దన్నారు. అధికారులు సూచించినట్లు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి విక్రయించాలని కలెక్టర్ పేర్కొన్నారు. కలెక్టర్ వెంట సబ్ కలెక్టర్ ఉమా శంకర్‌ప్రసాద్, తహసీల్దార్ వెంకటేశ్, వివిధ శాఖల అధికారులున్నారు.

## లగచర్ల రైతులను బేషరతుగా విడుదల చేయాలి



మంచాలలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

మంచాల, నవంబర్ 22 : ఫార్మా సిటీ పేరుతో గిరిజన రైతుల భూములను కాంగ్రెస్ ప్రభుత్వం లాక్కోవాలని చూడడం దారుణమని, అక్రమంగా అరెస్ట్ చేసిన రైతులను బేషరతుగా విడుదల చేయాలని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు చీరాల రమేశ్ అన్నారు. శుక్రవారం మంచాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఫార్మా కంపెనీల పేరుతో గిరిజనుల భూములను లాక్కొని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయాలని చూస్తున్నాడన్నారు. సీఎంకు ఫార్మా సిటీపై అంత ప్రేమ ఉంటే ప్రభుత్వం సమీకరించిన భూముల్లోనే ఫార్మా సిటీ ఏర్పాటు చేయాలని, లేకపోతే యాచారం మండలంలో సేకరించిన భూమిని తిరిగి రైతులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొడంగల్ నియోజకవర్గం లగచర్ల గ్రామంలోని రైతులను తీవ్రవాదులుగా పరిగణించి పోలీసులు అరెస్ట్ చేయడం దారుణమన్నారు. ఇందిరమ్మ రాజ్యం అంటే ఎంతో మార్పు వస్తుందనుకున్న రైతుల ఆశలు అడియాశలుగా మారాయని.. అక్రమంగా అరెస్ట్ చేసిన లగచర్ల రైతులను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి బహదూర్ నాయక్, నాయకులు పుల్లారెడ్డి, కిషన్‌రెడ్డి, వెంకటేశ్, జానీ పాషా, రాజూనాయక్, ప్రకాశ్‌రెడ్డి ఉన్నారు.

# శివలింగం మాయం

- దుండగులను కఠినంగా శిక్షించాలి
- బసవన్న ఆలయం వద్ద హిందూ సంఘాల ధర్నా
- సంఘటనా స్థలాన్ని పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ నరేందర్, సీఐ విజయ్‌కుమార్, నాయకులు



ఆలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు, హిందూ సంఘాల నాయకులు

షాద్‌నగర్‌టౌన్, నవంబర్ 22 : షాద్‌నగర్ మున్సిపాలిటీలోని జానంపేట వికానందకాలనీ అతి పురాతన బసవన్న ఆలయం ముందున్న శివలింగాన్ని గుర్తు తెలియని దుండగులు మాయం చేశారు. ప్రతి రోజూ పూజలు నిర్వహించే అర్చకులు శుక్రవారం ఉదయం ఆలయానికి వచ్చేసరికి ఆలయం ముందున్న శివలింగాన్ని తొలగించినట్లు కనిపించడంతో స్థానికులతో పాటు పోలీసులకు సమాచారం అందించారు. శివలింగాన్ని తొలగించడంతోపాటు వినాయక విగ్రహాన్ని ఆలయ సమీపంలో పడవేయడంపై హిందూ సంఘాల ఆధ్వర్యంలో ఆలయం వద్ద ధర్నా చేపట్టారు. సంఘటనా స్థలాన్ని మున్సిపల్ చైర్మన్ నరేందర్, కౌన్సిలర్ నర్సింహ, బీజేపీ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకుడు బస్వం, హిందూ సంఘాల నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..శివలింగాన్ని తొలగించిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. హిందూ మనోభావాలు దెబ్బతీసేలా హిందూ ఆలయాలపై దాడులు చేయడం దారుణమన్నారు. దాడులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. బసవన్న ఆలయంలో ఇదివరకే నూతన శివలింగాన్ని ప్రతిష్ఠించగా.. ఆలయం ముందు భిన్నంగా ఉన్న శివలింగాన్ని గుర్తు తెలియని దుండగులు తొలగించడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సంఘటనా స్థలాన్ని సీఐ విజయ్‌కుమార్ పరిశీలించి శివలింగాన్ని తొలగించిన దుండగులను గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో నాయకులు, హిందూ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ప్రత్యేక ఓటరు నమోదును సద్వినియోగం చేసుకోండి

**జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్**



కొడంగల్, నవంబరు 22 : ఈ నెల 23, 24 తేదీల్లో నిర్వహించనున్న ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని జిల్లాలోని నూతన ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ సూచించారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన విలేకరుతో మాట్లాడుతూ.. జనవరి 1 నాటికి 18 సంవత్సరాల నిండేవారందరూ ఓటు హక్కు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఈ నెలలో 9, 10 తేదీల్లో కూడా ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని, మళ్లీ రెండోసారి ప్రత్యేక క్యాంపు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. 23, 24 తేదీల్లో జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఆయా పోలింగ్ కేంద్రాల బూత్‌స్థాయి ఎన్నికల సిబ్బంది అందుబాటులో ఉండి దరఖాస్తులను స్వీకరించనున్నట్లు తెలిపారు. నూతన ఓటరు నమోదుతోపాటు తప్పుల సవరణ, అడ్రస్ మార్పు, చనిపోయినవారి పేర్ల తొలగింపు వంటి వాటికి సంబంధించి దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. ఓటర్లు ఈ ప్రత్యేక క్యాంపు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకొని ఓటు హక్కు పొందడంతోపాటు ఓటరు జాబితాలో సవరణలు చేసుకోవాలని ఆయన సూచించారు.

## ఎంఫార్మసీ పరీక్ష ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 22: ఓయూ పరిధిలోని ఎంఫార్మసీ కోర్సుల పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఫార్మసీ (పీసీఐ) (ఆల్ స్పెషలైజేషన్స్) రెండో సెమిస్టర్ మెయిన్, మొదటి, రెండు, మూడో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్ష ఫీజును ఈనెల 25వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్టు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

### ఎల్‌ఎల్‌ఎం పరీక్ష ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, నవంబర్ 22: ఓయూ పరిధిలోని ఎల్‌ఎల్‌ఎం కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్టు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్‌ఎల్‌ఎం (సీబీసీఎస్), ఎల్‌ఎల్‌ఎం (నాన్ సీబీసీఎస్) పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్టు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

### ఎంబీఏ (టీఎం), ఎంబీఏ (ఈవినింగ్) ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

ఓయూ పరిధిలోని ఎంబీఏ (టెక్నాలజీ మేనేజ్‌మెంట్), ఎంబీఏ (ఈవినింగ్) కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ప్రవేశ పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఓయూ డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఐ.పాండురంగారెడ్డి తెలిపారు. ఓయూ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం సెమిస్టర్ విధానంలో అందజేసే కోర్సుల్లో చేరేందుకు ప్రవేశ పరీక్షకు హాజరవ్వాల్సి ఉంటుందని చెప్పారు. ప్రొఫెసర్ జి.రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్ఆర్‌సీడీఈ) క్లాస్‌రూం బ్లాక్‌లో ఈనెల 24న ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. అభ్యర్థులు ముందుగానే పరీక్ష కేంద్రాన్ని చూసుకోవాలని సూచించారు.



పూడూరు దవాఖానను సందర్శించి రికార్డులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో వెంకటరమణ

## సమయ పాలన పాటించాలి

పూడూరు, నవంబర్ 22 : వైద్య సిబ్బంది సమయపాలన పాటించి రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించాలని డీఎంహెచ్‌వో వెంకటరమణ పేర్కొన్నారు. శుక్రవారం పూడూరులోని దవాఖానను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యం కోసం వచ్చే రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి సరైన మందులను అందజేయాలని సూచించారు. ప్రస్తుతం జిల్లాలో చాలా మంది జలుబు, దగ్గు, జ్వరంతో బాధపడుతున్నారని తెలిపారు. డాక్టర్లు తమ సెంటర్ పరిధిలోని అన్ని గ్రామాలను సందర్శించి మందులను అందజేయాలని సూచించారు. ప్రభుత్వం ముందు జాగ్రత్తగా అన్ని దవాఖానలకు మందులను సరఫరా చేస్తున్నదని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ నిరోష, ఎన్‌సీడీ ప్రోగ్రాం అధికారి రేణుకుమారి, జిల్లా ఎన్‌సీడీ సమన్వయకర్త మహేశ్ ఉన్నారు.

## అక్రమ వెంచర్ తొలగింపు



అక్రమ వెంచర్ బోర్డును తొలగిస్తున్న ఎంపీవో వేజన్న

మాడ్గుల, నవంబర్ 22 : మండలంలోని కొల్కులపల్లి గ్రామ శివారులో ఉన్న అక్రమ వెంచర్‌పై మండల పంచాయతీ అధికారి వేజన్న ఆధ్వర్యంలో శుక్రవారం వెంచర్‌కు సంబంధించిన బోర్డు, ప్లాట్ల హద్దురాళ్లను జేసీబీ సహాయంతో తొలగించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కొల్కులపల్లి గ్రామ శివారులో ఉన్న సర్వే నం.42/పి, 43/పి, 44/పిలో 9 ఎకరాల 32 గుంటల్లో అక్రమంగా వెంచర్ నిర్మాణం చేశారన్నారు. లేఅవుట్ చేసి ప్లాట్లు కూడా అమ్ముకుంటున్నారని, గ్రామ పంచాయతీకి 10% భూమి ఇవ్వాలని, 15 పర్సంటేజ్ భూమి మార్టిగేజ్ చేయాలని వెంచర్ నిర్వాహకులకు మూడుసార్లు నోటీసులు జారీ చేశామని చెప్పారు. వెంచర్ యాజమాన్యం స్పందించకపోవడంతో తొలగించామని వివరణ ఇచ్చారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నవీన్, గ్రామపంచాయతీ సిబ్బంది ఉన్నారు.

## కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

**జిల్లా వ్యవసాయ అధికారి నర్సింహారావు**



దామరగిద్ద పత్తి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి నర్సింహారావు

చేవెళ్ల రూరల్, నవంబర్ 22 : రైతులు పత్తి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి నర్సింహారావు అన్నారు. శుక్రవారం చేవెళ్ల మండల పరిధి దామరగిద్ద గ్రామంలో ఉన్న పత్తి కొనుగోలు కేంద్రాన్ని డీఏవో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులెవరూ ఆందోళన చెందవద్దని, అందరి కాటన్ విక్రయించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎవరికైనా సందేహాలుంటే వ్యవసాయ శాఖ అధికారులు నివృత్తి చేస్తారని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. డీఏవో వెంట ఏడీఏ సురేశ్‌బాబు, మండల వ్యవసాయ అధికారి శంకర్‌లాల్, వ్యవసాయ విస్తరణాధికారులు ఉన్నారు.

## ఇచ్చిన హామీలను అమలు చేయాలి

**జిల్లా ఎన్‌పీఆర్‌డీ గ్రామ కమిటీ అధ్యక్షురాలు సావిత్రమ్మ**



పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రమిన్న కస్తూర్‌పల్లి కమిటీ సభ్యులు

కొడంగల్, నవంబర్ 22 : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పింఛన్‌ను రూ.6వేలకు పెంచి వెంటనే అమలు చేయాలని జిల్లా ఎన్‌పీఆర్‌డీ గ్రామ కమిటీ అధ్యక్షురాలు సావిత్రమ్మ డిమాండ్ చేశారు. శుక్రవారం పింఛన్ పెంపు కోసం ఎన్‌పీఆర్‌డీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని కస్తూర్‌పల్లి గ్రామ కమిటీ అధ్యక్షురాలితో కలిసి పంచాయతీ సెక్రటరీకి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం 2024 జనవరి నుంచి పెంచిన పింఛన్‌ను అందిస్తామని తెలుపడం జరిగిందని, కానీ 12 నెలలు గడుస్తున్నప్పటికీ కొత్త పింఛన్ అమలు కావడం లేదన్నారు. కొత్త పింఛన్ కోసం రాష్ట్రంలోని పింఛన్‌దారులు ఎదురు చూస్తున్నారని, అదేవిధంగా కొత్తగా పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు ఇప్పటికీ పింఛన్ మంజూరు కాలేదన్నారు. అసరా పింఛన్ మంజూరుకు ప్రభుత్వం ఆదాయ పరిమితిని విధిస్తూ జీవో నం.17 జారీ చేసిందని, వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. 2015 కంటే ముందు సదరం సర్టిఫికెట్లను ఆన్‌లైన్‌లో ప్రింట్ తీసుకునే అవకాశాన్ని కల్పించాలని, వెంటనే అప్‌లోడ్ చేయాలని పేర్కొన్నారు. దివ్యాంగులకు ఉచిత బస్ సౌకర్యాన్ని కల్పించాలని, ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న దివ్యాంగుల బ్యాక్‌లాగ్ పోస్టుల గుర్తింపు కోసం ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని తెలిపారు. ప్రతి నెల 5న పింఛన్ అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కొత్తగా అమలు చేస్తున్న మహిళా శక్తి క్యాంటిన్లలో దివ్యాంగులకు 5శాతం రిజర్వేషన్ కేటాయించాలని, తీవ్ర అంగవైకల్యం కలిగిన దివ్యాంగులకు ప్రత్యేక అలెవెన్స్ కోసం లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలని ఆమె కోరారు.

# ట్రంక్ లైన్ల నిర్మాణం కోసం నిధులు మంజూరు

- రాచకాల్వను మరోసారి సర్వే చేసి ప్రణాళికలు సిద్ధం చేయండి
- ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



ఎల్బీనగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్ విభాగం అధికారులతో మాట్లాడుతున్న ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎల్బీనగర్, నవంబర్ 22 : ఎల్బీనగర్ నియోజకవర్గంలో మలివిడతగా ట్రంక్‌లైన్ల నిర్మాణం కోసం రూ. 2 కోట్లు మంజూరయ్యాయని, పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు సిద్ధంగా ఉన్నారని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఎల్బీనగర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఇరిగేషన్ అధికారులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ మరోసారి రాచకాల్వను సర్వే చేయించి యుద్ధ ప్రాతిపదికన ప్రణాళికలు సిద్ధం చేయించాలని సూచించారు. సాహెబ్‌నగర్‌కు చెందిన రైతులతో టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులతో సమావేశం నిర్వహించిన నేపథ్యంలో ట్రంక్‌లైన్ పనుల కోసం మరోసారి ఇరిగేషన్ అధికారులతో సమావేశమయ్యామని తెలిపారు. రాచకాల్వ సర్వే పూర్తి చేసి వచ్చే వర్షాకాలం లోపు ట్రంక్‌లైన్ పనులను పూర్తి చేయాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్‌రెడ్డి, ఇరిగేషన్ విభాగం అధికారులు శుక్లజ, సతీష్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## అంతర్ కళాశాల క్రీడల ముగింపు





సమావేశంలో మాట్లాడుతున్న వీసీ జానయ్య

వ్యవసాయ యూనివర్సిటీ, నవంబర్ 20: ఆటలలో రాణించడానికి మన విద్యార్థులకే మంచి అవకాశాలున్నాయని ప్రొ. జయశంకర్ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొ. అల్దాస్ జానయ్య అన్నారు. శుక్రవారం రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ వ్యవసాయ యూనివర్సిటీ పరిధిలోని ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన అంతర్ కళాశాల క్రీడల ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రపంచంలో అధిక జనాభా కల్గిన భారత్ , క్రీడలలో చివరి భా గంలో ఉండటం మన పాలకుల నిర్లక్ష్యమేనని అన్నారు. క్రీడలలకు తగిన ప్రాధాన్యత, నిధులు లేకపోవడమే అన్నారు. వ్యవసాయ విద్యలో అధిక శాతం గ్రామీణ విద్యార్థులున్నారని గుర్తుచేశారు. ప్రభుత్వం నూతనంగా స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చే స్తుండడం అభినందనీయమన్నారు. రానున్నకాలంలో వి శ్వవిద్యాలయం బడ్జెట్‌లో క్రీడలకు ప్రత్యేక నిధులు కేటాయించేలా కృషి చేస్తామన్నా రు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ క్రీడలలో ఓవరాల్ చాంపియన్ షిప్‌గా రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు కైవసం చేసుకోవడం అభినందనీయమని కళాశాల అసోసియేట్ డీన్ నరేందర్ రెడ్డి అన్నారు. అథ్లెటిక్ విభాగంలో అశ్వరావు పేటకు చెందిన అనిల్ కుమార్, రచన కైవసం చేసుకున్నారు. ఫిజికల్ డిపార్టుమెంట్ హెడ్ డా.సురేశ్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చురుకుగా తనకు ఆసక్తి గల క్రీడల పోటీలో పాల్గొన్నారని తెలిపారు అగ్రి ఇంజినీరింగ్ డా. జె. సత్యనారాయణ, డీన్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్ డా. వి. విజయ లక్ష్మి, బోధన , బోధనేతర సిబ్బంది. విశ్వవిద్యాలయం పరిధిలోని రాష్ట్ర వ్యాప్తంగా గల 11 కళాశాలలనుంచి విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రూప్-2 మైనార్టీ అభ్యర్థులకు ఉచిత ఆఫ్ లైన్ మాక్ టెస్ట్‌లు

**జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి హనుమంతరావు**



వికారాబాద్, నవంబర్ 22 : తెలంగాణ మైనార్టీ స్టడీ సర్కిల్, హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో గ్రూప్-2 పరీక్షల్లో పాల్గొనే మైనార్టీ అభ్యర్థుల (ముస్లిం, క్రైస్తవ, సిక్కు, జైన్, పార్సీ, బౌద్ధ) కోసం రెండు ఉచిత ఆఫ్ లైన్ మాక్ టెస్ట్‌లను డిసెంబర్ 2, 3, 9, 10 తేదీల్లో ఉదయం, మధ్యాహ్నం నిర్వహించబోతున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి హనుమంతరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత, ఆసక్తి గల మైనార్టీ అభ్యర్థులు తమ దరఖాస్తులను నవంబర్ 29 లోపు వికారాబాద్ కలెక్టర్ ఆఫీసులోని మైనారిటీ కార్యాలయం, రెండో అంతస్తు, ఎస్-17లో సమర్పించాలన్నారు. ఇతర వివరాల కోసం 9912740115ను సంప్రదించాలని సూచించారు.